ప్రజాశక్తి
గురువారం 23 అక్టోబర్ 2025
5
పార్వతీపురం మన్యం

నేడు ఉచితంగా కేన్సర్ వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటిడిఎ ఆధ్వర్యంలో ఈనెల 23న సీతంపేట ఏరియా ఆసుపత్రిలో జెమ్స్ ఆసుపత్రిలోని ప్రముఖ వైద్యుల ద్వారా ఉచిత కేన్సర్ వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉచిత కేన్సర్ వైద్య శిబిరం ద్వారా వ్యాధి నిర్ధారణకు అవసరమయ్యే మామోగ్రఫీ, అల్ట్రా సౌండ్, పాప్ స్మియర్ టెస్ట్, చెస్ట్ ఎక్సరే వంటి పరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు తెలిపారు. రాగోలు జెమ్స్ ఆసుపత్రి నుంచి ప్రముఖ అంకాలజిస్ట్ వైద్యులు ఈ వైద్య శిబిరంలో పాల్గొంటారని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని సీతంపేట ఐటిడిఎ పరిధిలోని ప్రజలంతా వినియోగించుకోవాలని ఈ సందర్భంగా పిఒ కోరారు.

ఉపాధి చట్టానికి మోడీ ప్రభుత్వం తూట్లు

- వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్
- పట్టణంలో భారీ ప్రదర్శన
- 200 రోజులు ఉపాధి పని కల్పించాలి
- గిరిజన గ్రామాలను సెడ్యూల్డు ఏరియాలో చేర్చాలి
- మహాసభలో పలు తీర్మానాలు

ప్రజాశక్తి - పార్వతీపురం

జాతీయ ఉపాధి హామీ చట్టానికి అడుగడుగునా మోడీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. బుధవారం వ్యవసాయ కార్మిక సంఘం 10వ జిల్లా మహాసభలు సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు అధ్యక్షతన జరిగాయి. అంతకుముందు స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నాలుగు రోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజా నాట్యమండలి సభ్యులు విప్లవ గేయాలు, నృత్యాలతో అలరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో బి.వెంకట్ మాట్లాడుతూ యుపిఎ ప్రభుత్వంలో వామపక్షాల ఒత్తిడితో జాతీయ ఉపాధి హామీ, అటవీహక్కు చట్టాలు వచ్చాయన్నారు. ఈ చట్టాలను మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వీర్యం చేస్తోందని ధ్వజమెత్తారు. ఏటా కేంద్ర బడ్జెట్లో ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించుకుంటూ నేడు 1.38శాతానికి కుదించిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎన్డీయే కూటమిలో ఉన్న టిడిపి, జనసేన కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా మోడీ భజన చేస్తున్నాయని విమర్శించారు. ప్రశ్నించడానికే పార్టీ పెట్టానని గొప్పలు చెప్పుకొంటున్న పవన్ కళ్యాణ్ దేశంలో పేదలకు తీరని అన్యాయం చేస్తున్న మోడీని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు. విశాఖలో గూగుల్ డేటా కంపెనీ ఏర్పాటు చేస్తున్నట్లు టిడిపి నాయకులు గొప్పగా చెపుతున్నారని, ఆ కంపెనీ లో ఎస్సీ, ఎస్టీ, బిసిలకు ఎన్ని ఉద్యోగాలు ఇస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీ ఏర్పాటు కాకముందే టిడిపి ప్రభుత్వం 22వేల కోట్లు రాయితీలు ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవేల పేరుతో గిరిజనుల భూములను అదానీ, అంబానీలకు కట్టబెట్టేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. అటవీ శాఖ మంత్రిగా పవన్ కల్యాణ్ రాష్ట్రంలో దళిత, గిరిజనులకు జరుగుతున్న అన్యాయం గురించి ప్రశ్నించడం లేదన్నారు. ఇండియాపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఎన్ని సుంకాలు విధిస్తున్నా ప్రధాని మోడీ నోరు మెదపడం లేదని అన్నారు. ట్రంప్ టారిఫ్ లకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని మార్చడానికి బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని అన్నారు. మోడీ పాలనలో దళిత, గిరిజనులకు రక్షణ లేదన్నారు. దళితులు, గిరిజనులకు ఎర్రజెండా ఎల్లప్పుడూ అండగా వుంటుందన్నారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ రంగ సంస్థలను మోడీ ప్రభుత్వం ప్రయివేటీ కరిస్తుంటే కేరళలో లెఫ్ట్ ప్రభుత్వం ప్రయివేటీకరణకు అడ్డుకట్ట వేస్తోందని చెప్పారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న, జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బంటు దాసు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మధరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మీ, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కోరాడ ఈశ్వరరావు, ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రామస్వామి, శ్రామిక మహిళా సంఘం జిల్లా నాయకులు పి.వరాలు, ఐద్వా జిల్లా కార్యదర్శి లక్ష్మి బహిరంగ సభలో సౌహార్ధ సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మికులు, రైతులు, గిరిజనులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అనంతరం గిరిజన సామాజిక భవనంలో నిర్వహించిన ప్రతినిధుల సభలో పుచ్చలపల్లి సుందరయ్య, రెడ్డి శ్రీరామమూర్తి, డాక్టర్ ఆర్.కుప్పానాయుడు చిత్రపటాలకు పూలమాలవేసి, అమరవీరులకు స్థూపాలకు నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ప్రవేశపెట్టిన సంఘం నిర్మాణ నివేదికను ప్రతినిధులంతా ఆమోదించారు. ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణ పనులను ప్రభుత్వమే నిర్వహించాలని, అలాగే ఉపాధి పనులు 200 రోజులు పెంచాలని, రోజుకు రూ.600 ఇవ్వాలని, పని కేంద్రాల్లో ప్రభుత్వ షరతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

బహిరంగసభలో సంఘం జాతీయ కార్యదర్శి వెంకట్

షెడ్యూల్డు గ్రామాల్లో చేర్చాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న

రాష్ట్రంలో షెడ్యూల్డ్ జాబితాలో లేని గిరిజన గ్రామాలు చాలా వున్నాయని, వాటిని చేర్చేందుకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేయడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న అన్నారు. నాన్ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న గిరిజనుల భూములకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు. 1/70 చట్టం అమలు కావడం లేదన్నారు. గిరిజన భూముల అన్యాక్రాంతమవుతున్నాయని చెప్పారు. దీనిపై గిరిజనులు పోరాడాలని పిలుపునిచ్చారు. ఉపాధి హామీ, అటవీ హక్కుల చట్టాలకు కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుంటే సంబంధించిన శాఖల మంత్రిగా పవన్‌కళ్యాణ్ చేతకాని వాడిలా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు.

జిల్లా అభివృద్ధి పై ఎమ్మెల్యే లు మాట్లాడడం లేదు

వ్యకాస జిల్లా కార్యదర్శి గంగు నాయుడు

మన్యం జిల్లా ఏర్పడి నాలుగేళ్లు కావస్తున్నా అభివృద్ధిపై జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు చెప్పారు. పాచిపెంట మండలం లోని 782 ఎకరాల ప్రభుత్వ భూమిని గిరిజనులు అనేక ఏళ్లుగా సాగు చేస్తున్నా పట్టాలు ఇవ్వడం లేదని చెప్పారు. ఈ ప్రాంతంలో గనులున్నాయని సాగు భూములకు పట్టాలు మంజూరు చేయడం లేదని చెప్పారు. మక్కువ మండలం దుగ్గేరులో 2వేల మెగా వాట్స్ విద్యుత్ ప్రాజెక్టుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని, దీనికి తోటపల్లి, విఆర్ఎస్ రిజర్వాయర్ల నుంచి నీరు సరఫరా చేసే యోచనలో వుందన్నారు. జిల్లాలో రూ.3వేల కోట్లు ఖర్చు చేస్తే సాగునీటి ప్రాజెక్టులన్నీ పూర్తవుతాయని చెప్పారు. గిరిజన విద్యార్థుల మరణాలపై ప్రభుత్వ తీరుపై గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ పోరాడాయని చెప్పారు.

పట్టణంలో నిర్వహిస్తున్న భారీ ర్యాలీ

జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా మర్రి శ్రీనివాసరావు, రెడ్డి ఈశ్వరరావు

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వెంకన్న సమక్షంలో నూతన జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా మర్రి శ్రీనివాసరావు, రెడ్డి ఈశ్వరరావు, కోశాధికారి గా కొల్లి సాంబమూర్తి, సహాయ కార్యదర్శులుగా కొల్లి గంగునాయుడు, పాలమిట్ట రాము, ఉపాధ్యక్షులుగా దూసి దుర్గారావు, జిల్లా కమిటీ సభ్యులుగా సిహెచ్ కృష్ణ, పిట్టల సీతారాం, భూతల మోహనరావు, ఎన్.సింహాచలం, ఎస్.రామారావు, వెన్నెల వేణు, వై.పాపమ్మతో పాటు మరో ఇద్దరిని కో-ఆప్షన్ సభ్యులుగా ఎన్నుకున్నారు.

వన్‌స్టాప్ సెంటర్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యే అధికారులు

వన్ స్టాప్ సెంటర్ భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక ప్రభుతతాసుపత్రి నిర్మాణ భవన ఆవరణలో ఏర్పాటు చేసిన వన్ స్టాప్ సెంటర్ కు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రూ. 60,00 లక్షల అంచనా విలువతో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. మహిళలకు ఎటువంటి సమస్యలు ఉన్నా వన్ స్టాప్ సెంటర్‌కు వచ్చి ఫిర్యాదు చేస్తే తదుపరి చర్యలు చేపడుతుందన్నారు. తల్లిదండ్రులకు అంగన్వాడీ కేంద్రాలపై పూర్తి నమ్మకం ఉన్నందునే ప్రతి ఒక్కరూ తమ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపిస్తున్నారన్నారు. ప్రతి అమ్మాయికి తప్పక గుడ్ టచ్, బ్యాడ్ టచ్ లపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతి అంగన్వాడీ కేంద్రానికి ఒక లక్ష రూపాయలు అందజేస్తున్నామన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు పూర్తి స్థాయి మౌళిక సదుపాయాలు అందించాలన్నారు. ఫిబ్రవరిలో భవనం ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు వేగవంతం చేయాలన్నారు. డోలీ మోతలు లేని జిల్లాగా ముందుకు సాగలానే ఉదేశ్యంతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. అంతకుముందు ఈ కార్యక్రమంలో నెల రోజుల పాటు నిర్వహించిన పోషణ మహా కార్యక్రమం సంబంధించి ఏర్పాటు చేసిన ప్రదర్శనను మంత్రి ప్రజాప్రతినిధులు, కలెక్టర్, అధికారులతో కలిసి తిలకించారు. జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఈ వన్ స్టాప్ సెంటర్ ఒక అండా, దండగా నిలుస్తుందన్నారు. ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మాట్లాడుతూ పిల్లలకు పోషక విలువలతో కూడిన ఆహారం అందిస్తూ పిల్లల అలనా, పాలనా చూస్తున్న మహిళా, శిశు సంక్షేమ శాఖ చాలా గొప్ప విధులు నిర్వహిస్తుందన్నారు. పార్వతీపురం ఎమ్మెల్యే బి.విజయచంద్ర మాట్లాడుతూ ఈ సెంటర్ ద్వారా కలిగే లాభాలు ప్రతి మహిళకు అవగాహన కల్పించాలన్నారు. ఎఎస్‌పి అంకితా సూరానా మాట్లాడుతూ వన్ స్టాప్ సెంటర్ అంటే మహిళలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంటాయన్నారు. దీనిపై ప్రతి మహిళా అవగాహన చేసుకొని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ జాయింట్ డైరెక్టర్ చిన్మయదేవి, పిడి టి కనకదుర్గ, వివిధ శాఖల అధికారులు సిబ్బంది ఉన్నారు.

రోడ్డు మార్గం లేక గిరిజనుల అవస్థలు

ప్రజాశక్తి - కురుపాం

డోలీపై ట్రాన్స్‌ఫార్మర్‌ను మోసుకెళ్తున్న చాపరాయిగూడ గిరిజనులు

గిరి శిఖర గ్రామాలకు రహదారి మార్గం సక్రమంగా లేక గిరిజనులు ప్రతిరోజు నానా అవస్థలు పడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్నా, పాలకులు, అధికారులు మారుతున్నా గిరిజనుల కష్టాలు మాత్రం తీరడం లేదు. ఇందుకు నిదర్శనం మండలంలోని ఊసకొండ పంచాయితీ చాపరాయిగూడ గిరిజన గ్రామానికి విద్యుత్ ట్రాన్సార్మర్ కాలిపోయిన నేపథ్యంలో ఆ గ్రామ గిరిజనులు పొడ్డీస నుంచి మూడు కిలోమీటర్ల దూరం డోలి మోత ద్వారా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను మోసుకొని తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అత్యవసర సమయంలో ఎవరికైనా ఆరోగ్యం బాగు లేకపోయినా డోలి ద్వారా తీసుకెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కనీసం తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

డిఐఇఒ చొరవతో

ప్రాక్టికల్స్ నిర్వహణ సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి -సీతంపేట

స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్లస్ కోర్సు నిర్వహణ ప్రారంభమైంది. ఎంపిసి, బైపిసి గ్రూపుల్లో అడ్మిషన్లు కల్పించారు. ప్రారంభంలో 52 మంది విద్యార్థులు ఈ రెండు గ్రూపుల్లో చేరారు. 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వ మౌఖిక ఆదేశాలు మేరకు, ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలను నిలిపివేశారు. దీంతో గత ఏడాది ప్రథమ సంవత్సరం పూర్తి చేసుకున్న 52 మంది విద్యార్థులు ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఇంటర్ కోర్సుకు ప్రత్యేక బోధన సిబ్బందిని నియమించక పోవడంతో హైస్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులే సైన్స్, మ్యాథ్స్, బయాలజీ, లాంగ్వేజెస్ వంటి సబ్జెక్టులను బోధిస్తున్నారు. గత విద్యా సంవత్సరంలో ఈ ఉపాధ్యాయుల కృషితో విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో చక్కటి ఫలితాలు సాధించారు. అయితే ప్రస్తుత విద్యా సంవత్సరంలో సమస్య తలెత్తింది. సైన్స్ ప్రయోగాల నిర్వహణకు అవసరమయ్యే ప్రయోగ పరికరాలు ఈ పాఠశాలల్లో అందుబాటులో లేవు. ప్రభుత్వంచే ప్రయోగశాల కోసం ఒక్క రూపాయి కూడా విడుదల కానందున విద్యార్థులకు, ప్రాక్టికల్స్ నిర్వహించేందుకు అవకాశాలు కుదరలేదు. దీంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. తల్లిదండ్రులు కూడా పాఠశాల హెచ్ఎంల వద్ద విన్నవించుకున్నారు. ఈ విషయం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి వై. నాగేశ్వరరావు దృష్టికి పాఠశాల హెచ్ఎం తీసుకువెళ్లారు. డిఐఇఒ వెంటనే స్పందించారు. ఏ యాజమాన్యానికి చెందిన వారైనప్పటికీ, ఇంటర్ విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు న్యాయం జరగాల్సిందేనంటూ చర్యలకు ఉపక్రమించారు.. బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల సందర్శనకు వచ్చిన ఆయన వద్ద ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులు, ప్రాక్టికల్స్ జరగకపోవడం పట్ల ఏకరువు పెట్టారు. విద్యార్థుల సమస్యలను ప్రత్యక్షంగా విని, తక్షణమే పరిష్కార మార్గం చూపించారు. డిఐఇఒ ప్రత్యేక చొరవతో, సమీపంలోని ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌ను సంప్రదించారు. తాత్కాలికంగా ఆ కళాశాలలోనే ప్రాక్టికల్స్ నిర్వహించుకునేలా విద్యార్థులకు అనుమతి కల్పించేలా చూడాలని కోరారు.

గిరిశిఖర గ్రామాల్లో రోడ్ల పూర్తే లక్ష్యం

- తొలి విడతగా రూ. 40కోట్ల నిధులు విడుదల
- ప్రతి గ్రామానికి అంబులెన్సు వెళ్లేలా చర్యలు
- రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి -పార్వతీపురం

జిల్లాలో డోలీ మోతలను రూపుమాపేందుకు కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఇప్పటికే రూ.1,300 కోట్లతో రహదారులు లేని గ్రామాల్లో రోడ్లు వేసినట్లు పేర్కొన్నారు. పార్వతీపురంలో వన్ స్టాప్ సెంటర్ ప్రారంభత్సవం అనంతరం మంత్రి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం గిరిశిఖర గ్రామాల్లో ఇంకా డోలీ మోతలు ఉన్నాయని అంగీకరిస్తూనే, ప్రతి గ్రామానికి వాహనం, ముఖ్యంగా 108 అంబులెన్స్ వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందులో భాగంగా కేవలం నాలుగు నియోజకవర్గాల్లోని డోలీ మోతల ప్రాంతాలను అరికట్టడానికి తొలివిడతగా రూ.40 కోట్లతో పనులు ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ప్రతి గ్రామానికి వాహనాలు వెళ్లాలనే లక్ష్యంతో మొదటి దశలో 'ఫార్మేషన్ ఆఫ్ రోడ్స్' చేపడుతున్నామన్నారు. మొదటగా డబ్ల్యుబిఎం (వాటర్ బౌండ్ మెకాడమ్) రోడ్లు వేసి, ఆ తర్వాత బిటి- బ్లాక్ టాప్ రోడ్లు వేసే అవకాశం ఉందని తెలిపారు. కొన్ని చోట్ల సీసీ రోడ్ల నిర్మాణానికి కూడా యోచిస్తున్నామని చెప్పారు. రోడ్లు స్థిరంగా ఉండేందుకు, నీటి ప్రవాహం వల్ల దెబ్బతినకుండా ఉండేందుకు అవసరమైన చోట్ల కల్వర్టులను కూడా నిర్మిస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి వాహనాల సౌకర్యం కల్పించే కార్యాచరణ ప్రణాళికపై ఎమ్మెల్యేలు, కలెక్టర్, సిఇఒతో సహా ముఖ్య అధికారులతో సమావేశమై చర్చించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర నిధులను వినియోగించి గిరి శిఖర గ్రామాలన్నింటికీ రోడ్లను పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

జిల్లా పోలీసు ఖ్యాతిని పెంచాలి : ఎస్‌పి

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

అరుణ్‌కుమార్‌ను అభినందిస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

మునుముందు జరిగే క్రీడల్లో పాల్గొని జిల్లా పోలీస్ ఖ్యాతిని పెంచాలని ఎస్పీ ఎస్ వి మాధవరెడ్డి అన్నారు. ఎఆర్ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న కె.అరుణ్ కుమార్ ఈనెల 7 నుంచి 17 జమ్మూకాశ్మీర్‌లో జరిగిన 10వ అల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ తైక్వాండో పోటిల్లో సీనియర్ పురుషుల విభాగంలో (అండర్ 87 కేజీల విభాగంలో) ఆంధ్రప్రదేశ్ తరుపున పాల్గొని విజయం సాధించి కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా ఎస్పీ మాధవ్ రెడ్డిని స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం అరుణ్ కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. 10వ అల్ ఇండియా పోలీస్ మీట్ తైక్వాండో పోటిలలో విజయం సాధించి రాష్ట్రానికి, జిల్లాకి పేరు తెచ్చిన కానిస్టేబుల్ అరుణ్ కుమార్‌ను జిల్లా ఎస్పీ సత్కరించి, అభినందించారు. మున్ముందు జరగబోయే క్రీడల్లో పాల్గొని విజయం సాధించి రాష్ట్ర, జిల్లా పోలీస్ ఖ్యాతిని పెంచాలని సూచించారు. అంతేకాకుండా కె.అరుణ్ కుమార్ (ఏఆర్ పిసి-1669/753) 2016,2021,2022 వ సం., జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో కూడా పాల్గొని బంగారు పతకాన్ని గెలుపొందారు. 2017లో పశ్చిమ బెంగాల్ స్టేట్ పోలీస్ శాఖ నిర్వహించిన ఆల్ ఇండియా పోలీస్ గేమ్స్‌లో 74 కేజీల విభాగంలో పాల్గొని రజత పతకాన్ని, 2024లో గౌహతిలో జరిగిన 9వ అల్ ఇండియా పోలీస్ మీట్ తైక్వాండో పోటీల్లో సీనియర్ పురుషుల విభాగంలో (80 కేజీల విభాగంలో) రాష్ట్రం తరుపున పాల్గొని విజయం సాధించి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఏఆర్ ఆర్ఐ లు నాయుడు, రాంబాబు కూడా పాల్గొని అరుణ్ కుమార్ ని అభినందించారు..

త్యాగానికి ప్రతి రూపం కొమరం భీమ్ : రాజన్నదొర

ప్రజాశక్తి - సాలూరు



కొమరం భీమ్‌కు నివాళ్లు అర్పిస్తున్న రాజన్నదొర, వైసిపి నాయకులు

భారత స్వాతంత్ర్య ఉద్యమ చరిత్రలో అడవుల నుంచి అగ్నిజ్వాలై ఎగిసిన ఆదివాసీల తిరుగు బాట్లకు ప్రత్యేక స్థానం ఉందని, అధికారిక చరిత్ర పుటల్లో వెలుగు చూడక పోయినా, తెలంగాణ గిరిజన గుండెల్లో వేదనను వీరత్వంగా మార్చిన మహోన్నత వ్యక్తిత్వం గల కొమరం భీమ్ చిరస్మరణీయంగా నిలిచిపోయారని మాజీ డిప్యూటీ సిఎం పి.రాజన్నదొర కొనియాడారు. కొమరం భీమ్ జయంతి సందర్భంగా రాజన్నదొర తన క్యాంప్ కార్యాలయంలో కొమరం భీమ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లి అర్పించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కొమరం భీమ్ జీవితం ఒక తత్త్వం, ఆయన ఉద్యమమే ఒక జీవ చైతన్యమని కొనియాడారు. ప్రధానంగా ఆయన 'జల్ - జంగిల్ - జమీన్' నినాదాన్ని ప్రస్తావిస్తూ అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్ లక్ష్యం ఒక్కటేనని పేర్కొన్నారు. "అడవి మీద హక్కు మాది. ఇది ప్రభుత్వం ఇచ్చినది కాదు, ప్రకృతి ఇచ్చినది, దేవుడు ఇచ్చినది. దీనిపై మాకు హక్కు ఉంది" అని గిరిజనులకు అండగా పోరాటం చేసిన యోధులు అల్లూరి, కొమరం భీమ్ అని అన్నారు. వీరితో పాటు బిర్సాముండా, ఒడిశాలో బిషన్ చక్రవర్తి కూడా ఇదే స్ఫూర్తితో పోరాడారని గుర్తు చేశారు. గిరిజనుల పేర్లు చెప్పుకొని కొంతమంది పదవులు పొందుతున్నారని విమర్శించారు. నిజమైన గిరిజనులైతే, వారిలో నూరు శాతం గిరిజన రక్తం ప్రవహించినట్లయితే ఈ పోరాట యోధులని మర్చిపోరని స్పష్టం చేశారు. ఈ యోధులు స్వాతంత్ర్యం రాకముందే తమ హక్కుల కోసం పోరాటం చేసిన మహనీయులని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగపండు అప్పలనాయుడు, విశ్రాంత ఎంఇఒ పెంట సత్యనారాయణ, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై ఫోక్సో కేసు

పరారీలో నిందితుడు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణంలోని రామాపురం కాలనీలో తొమ్మిదేళ్ల బాలికపై వరుసకు అన్నయ్య అయిన యువకుడే అఘాయిత్యానికి పాల్పడిన దారుణం ఆలస్యంగా వెలుగుచూసింది. ఈ నెల 19న జరిగిన ఈ ఘటనపై బాధిత బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. సారిక వీధికి చెందిన దంపతుల తొమ్మిదేళ్ల కుమార్తె రామాపురం కాలనీలో గల తన అమ్మమ్మ ఇంటి వద్ద చదువుకుంటోంది. 19న రాత్రి అమ్మమ్మ పక్కన పడుకున్న బాలికను డోనక పవన్ కుమార్ అనే యువకుడు తన ఇంటి మేడపైకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయం ఎవరికైనా చెబితే బయటకు విసిరిస్తానని బెదిరించడంతో భయపడిన బాలిక మొదట చెప్పలేదు. రెండు రోజుల పాటు బాలికలో మార్పు గమనించిన తల్లిదండ్రులు గట్టిగా అడగ్గా అసలు విషయం వెల్లడించింది. నిందితుడు డోనక పవన్‌కుమార్‌పై పట్టణ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీట్ ఉందని, 2018లో వృద్ధురాలిపై అత్యాచారం కేసులో ఏడాది పాటు రిమాండ్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రమంలో సిఐ కె.మురళీధర్ నిందితుడిపై ఫోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. నిందితుడు పరారీలో ఉన్న ట్లు పోలీసులు తెలిపారు.

వైద్యులు చాలా అప్రమత్తంగా ఉండాలి : మంత్రి

ప్రజాశక్తి - పార్వతీపురం



ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ యశ్వంత్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న మంత్రి, కలెక్టర్

జిల్లాలో వైద్యులు చాలా అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా జ్వరాలు వస్తే అక్కడికక్కడే స్పందించాలని రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వైద్యాధికారులను తేల్చిచెప్పారు. వసతి గృహాల్లోని పిల్లలు అనారోగ్యంతో ఆసుపత్రులకు వెళ్ళక ముందే ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సీజనులో జ్వరాలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని, కావున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. వారంలో రెండు రోజుల పాటు పిల్లల ఆరోగ్యాన్ని పరీక్షించాలని చెప్పారు. జిల్లాలో ఉన్న 199 గురుకులాలకు ఏఎన్ఎంలను కేటాయించడం జరిగిందని, వాటితో పాటు 750 ఆశ్రమ పాఠశాలలకు ఎఎన్ఎంలు వెళ్లి విద్యార్థులను పరీక్షించాలన్నారు. సమ్మెలో ఉన్న వైద్యులు వలన సేవలకు ఎటువంటి ఆటంకం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మరుగుదొడ్లు, వసతి గదులు, తాగునీరు అన్నీ పక్కాగా ఉండాలని, ఆర్ఒ ప్లాంట్ పాడైతే తక్షణమే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. విద్యార్థులకు వ్యాయామం అవసరమని, ఆ దిశగా క్రీడలు, యోగా వంటివి నిర్వహించాలని అన్నారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయాలని, దళాయివలస జలపాతం ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు. గిరిశిఖర ప్రాంతాల్లో రహదారులకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తున్నామని, జిల్లాలో పాడైన రహదారులపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని పూర్తిచేయాలని అన్నారు. అనంతరం రాష్టంలో ఉత్తమ ఐటిడిఎగా పార్వతీపురం ఎంపికకావడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేస్తూ, జెసి, ఇన్‌ఛార్జి పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డికి దుస్సాలువతో ఘనంగా సత్కరించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఆదికర్మయోగి కార్యక్రమాన్ని అమలుచేస్తూ గిరిజన మహిళలకు ఉపాధి కల్పిస్తున్నట్లు వివరించారు. అన్ని వసతి గృహాలు, పాఠశాలల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారా చేస్తున్న అభివృద్ధిని మంత్రికి కలెక్టర్ వివరించారు. సమావేశంలో ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్లు ఆర్. వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, సబ్ కలెక్టర్లు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య సూత్రలు చెబుతున్న కమిషనర్ రత్నకుమార్

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం : కమిషనర్

ప్రజాశక్తి - సాలూరు

రుతుపవనాలు, మారుతున్న వాతావరణం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ టిటి రత్నకుమార్ తెలిపారు. మున్సిపల్ పాఠశాలలో పర్యావరణ కార్యదర్శులతో కలిసి పట్టణ పరిధిలో గల బంగారమ్మ కాలనీ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలోని పిల్లలకు సీజనల్ వ్యాధులు, దోమ కాటు వల్ల వచ్చే వ్యాధుల గురించి, తరచూ చేతులు శుభ్రంగా కడుక్కోవాలని (హ్యాండ్ వాష్) బుధవారం అవగాహన కల్పించారు. అలాగే పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహం బాలుర హాస్టల్లో పరిసరాలు పరిశుభ్రత, బాత్రూమ్‌ల్లో దోమలు ప్రవేశించకుండా వసతి గదులకు ఉన్న కిటికీలకు నెటలను అమర్చారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ, వార్డు సెక్రటరీలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వసంతకుమారి

సాదాసీదాగా మండల సమావేశం

ప్రజాశక్తి -భామిని

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తోట శాంతికుమారి అధ్యక్షతన ఎంపిడిఒ వసంత కుమారి ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం సమస్యలపై చర్చ జరగకుండానే సాదాసీదాగా ముగిసింది. తొలుత ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలో పత్తి, మొక్క జొన్న పంటలు వర్షాలకు తడిసి ముద్దవుతున్నా వ్యవసాయశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. నల్లారాయి గూడ వాటర్ వాల్ జిల్లా కలెక్టర్ దృష్టికి వెళ్లిందని, దీన్ని ఉపాధిహామీ నిధులతో జంగిల్ క్లియరెన్స్ చేసి, నడక మార్గం అభివృద్ధి చేస్తామని ఎపిఎం తెలిపారు. గ్రామాలలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని ఎంఇఒ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులు తోట సింహాచలం, వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, ఎంపిటిసి టింగ అన్నాజీరావు, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, వివిధశాఖ అధికారులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డ్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణ శివారులో ఉన్న డంపింగ్ యార్డ్ ను స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర, మున్సిపల్ ఎఫ్‌ఎసి కమిషనర్ జి శ్రీనివాసరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.పకీర్ రాజు టిడిపి నాయకులతో కలిసి బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పార్వతీపురం మున్సిపాలిటీలో గత కొన్నేళ్లుగా పరిష్కారానికి నోచుకోని డంపింగ్ యార్డ్ సమస్యపై దృష్టి సారించడం జరిగిందన్నారు. ఆ ప్రక్రియలో భాగంగా చెత్తను పర్యావరణ సానుకూల పద్ధతిలో వేరు చేసేందుకు కావాల్సిన మిషనరీ యూనిట్ ను విశాఖపట్నానికి చెందిన తరుణ్ ఏజెన్సీకి టెండర్ ఖరారు చేయడం జరిగిందన్నారు. మరో రెండు మూడు రోజుల్లో డంపింగ్ యార్డ్ లో ఉన్న చెత్తను తొలగించేందుకు పనులు ప్రారంభమవుతాయని అన్నారు. అనంతరం తరుణ్ అసోసియేట్ సభ్యులు ఎమ్మెల్యేతో మాట్లాడుతూ చెత్తను తరలించుటకు వాహనాలకు అనుకూలంగా ఉండేలా రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరారు.

'అధికారులు వస్తే తాగునీరు రాదు'

ప్రజాశక్తి - కురుపాం

మరమ్మతులకు గురైన వాటర్ ట్యాంకు

అధికారులు వస్తే తాగునీరు అసలు రాదని మండలంలో గుమ్మడ గూడ పంచాయతీ దండుసుర గ్రామ గిరిజన ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి పథకాలు ఉన్నప్పటికీ వాటి ద్వారా తమ గిరిజన ప్రజలకు సక్రమంగా తాగునీరందడం లేదని ఎప్పుడు మరమ్మతులకు గురవుతూ ఉంటాయని ఏవైనా ప్రభుత్వ కార్యక్రమాలు, సమావేశాలు ఉన్నాయంటే అధికారులు ముందస్తుగా వచ్చి మరమ్మతులు చేపట్టి తాత్కాలికంగా తాగునీరు అందించి మామ అనిపించి వెళ్తున్నారు తప్ప శాశ్వతంగా మరమ్మతులు చేపట్టడం గాని లేదా కొత్తగా మోటర్లు వేసి బాగు చేయకపోవడం వల్ల నిత్యం తాగునీటి సమస్యను ఎదుర్కొంటున్నామని కావున ఉన్నతాధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి శాశ్వతంగా తాగునీరందించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నామన్నారు.

వెంకటరాయుని కోనేరులో గుర్రపు డెక్క తొలగింపు

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని వెంకటరాయుని కోనేరులోని గుర్రపు డెక్కను బుధవారం తొలగించారు. కార్తీక మాసం సందర్భంగా భక్తుల స్నానాలు తెప్ప దీపాలకు అనువు ఉండేలా జెసిబితో పనులు చేయిస్తున్నారు. ఈ పనులను పట్టణ టిడిపి అధ్యక్షులు గంటా సంతోష్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఆయనతో పాటు కాంట్రాక్టర్ బొడ్డు రాంబాబు, కూటమి నేతలు కొంచాడ అరుణ్ కుమార్ , హనుమంతు తమ్మారావు, బల్ల వెంకటరావు, నిర్మాల తదితరులు ఉన్నారు.

గదబవలసలో గ్రామసభ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జియమ్మవలస మండలం పెదబుడ్డిడి గ్రామ పంచాయతీ పరిధిలో గల గదబవలసలో బుధవారం ఉపాధిహామీ చట్టం కార్యక్రమంలో భాగంగా ప్రజల భాగస్వామ్యంతో టెక్నికల్ అసిస్టెంట్ గుంట్రెడ్డి వెంకట అనంతరావు ఆధ్వర్యంలో పిఆర్ఎ గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ మాట్లాడుతూ రాబోయే 2026- 27 ఆర్థిక సంవత్సరానికి పనులు గుర్తించే నిమిత్తం వేతనదారులు, గ్రామస్తుల భాగస్వామ్యంతో గ్రామసభ నిర్వహించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా వేతనదారులు, మేట్లు ఆధ్వర్యంలో సామాజిక పటం, వనరుల పటం వార్షిక పనులకు సంబంధించి వేతనదారులకు పనులు కల్పనలో భాగంగా రంగవల్లులతో కూడిన చిత్ర పటాలు వేసినట్టు తెలిపారు. వేతనదారులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు వావిలపల్లి వరహాలనాయుడు, మేట్లు, ఉపాధిహామీ వేతనదారులు పాల్గొన్నారు.

గ్రామంలో ర్యాలీ చేస్తున్నఉపాధిహామీ సిబ్బంది

ప్రతి గ్రామంలో పది యూనిట్లు ఏర్పాటు కావాలి

ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో డ్రైవ్ చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

ప్రతి గ్రామంలో ఐదు నుంచి పది యూనిట్లను (పరిశ్రమలు) నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. దీని కోసం ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వం తీసుకువచ్చిన ఐడిపి (ఇండస్ట్రీయల్ డెవలప్మెంట్ పాలసీ)ని మరింత ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. పరిశ్రమల స్థాపనల ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన దిశగా అవసరమైన నైపుణ్యాల పెంపునకు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ఏర్పాటు చేసిన ఎంటర్‌ప్రెన్యూర్షిప్ (వ్యవస్థాపకత) వర్క్‌షాప్ కార్యక్రమం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ఐదు నుంచి పది యూనిట్లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే ప్రతి శాఖకు ఒక నోడల్ అధికారిని నియమించడం జరుగుతుందని తెలిపారు. మహిళా సంఘాలకు, యువతకు సమావేశాలను ఏర్పాటు చేసి పూర్తి అవగాహన కల్పించాలన్నారు. ఇక్కడ నిర్వహించిన పిపిటి అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో ప్రతి ఏటా డ్రైవ్ నిర్వహించి బ్యాంకు ఖాతాలను తెరవాలన్నారు. మండలస్థాయిలో సమావేశాలు నిర్వహించినప్పుడు బ్యాంకర్లు కూడా హాజరయ్యేలా చూడాలని ఎల్‌డిఎంను ఆదేశించారు. అలాగే పరిశ్రమల శాఖ ఇచ్చిన అవగాహన సదస్సులో ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని చెప్పారు. పిఎంఇజిపి (ప్రధాన మంత్రి ఉపాధి కల్పన పథకం) ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొత్త ఉద్యోగాలు సృష్టించబడాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అన్నారు. దీని ద్వారా స్వయం ఉపాధి కోసం కొత్త మైక్రో-ఎంటర్‌ప్రైజెస్/ వ్యాపారాలను ఏర్పాటు చేయడానికి ఆర్థిక సహాయం అందిస్తుందని, కావున అందుకు తగిన విధంగా కృషి చేయాలని కోరారు. అంతకుముందు కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో వివిధ ఉత్పత్తులపై ఏర్పాటు చేసిన స్టాల్స్ ను కలెక్టర్ తిలకించారు.

జిల్లా పరిశ్రమల కేంద్రం జిల్లా మేనేజర్ ఎం.వి.కరుణాకర్ మాట్లాడుతూ పిపిటి ద్వారా పరిశ్రమల అనుమతి మంజూరు, తయారీ, జనరల్ సర్వీస్ ప్రాజెక్ట్స్

యూనిట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభాకరరెడ్డి

జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా దరఖాస్తు చేసుకునే వివరాలను అందరికీ అర్థమయ్యేలా వివరించారు. విద్యార్హత కలిగి 18 ఏళ్లు దాటిన వారంతా అర్హులని తెలిపారు. వ్యక్తిగతంగా, స్వయం సహాయక సంఘాల వారు కూడా అర్హులని, రాయితీ మూడేళ్ల తర్వాత వ్యక్తిగత ఖాతాకు జమ చేయబడుతుందని తెలిపారు. తప్పనిసరిగా మూడేళ్లు యూనిట్లు నిర్వహించాలని, అర్బన్, రూరల్ సబ్సిడీ వివరాలు, అలాగే ఎలా దరఖాస్తూ చేసుకోవాలో వివరించారు. అవసరమైన ధ్రువపత్రాలు ఆధార్, కులధ్రువీకరణ పత్రం, విద్యార్హతలు, ప్రాజెక్ట్ రిపోర్ట్, బ్యాంక్ వివరాలు, రూరల్ ఏరియా ధ్రువపత్రం ఉండాలని, అలాగే టూరిజం సపోర్టింగ్, మిల్లెట్ ప్రాసెసింగ్, ఆగ్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఇండస్ట్రీస్ వివరాలను వివరించారు. కొత్త పరిశ్రమలను ఉద్యమ్ నందు రిజిస్ట్రేషన్ తప్పక చేయించుకోవాలని సూచించారు. ఈ ఎంటర్‌ప్రెన్యూర్షిప్ కార్యక్రమనికి బిసి కార్పొరేషన్ ఈడి ఆర్.గడ్డెమ్మ, జిల్లా హేండ్లూమ్ అండ్ టెక్స్ టైల్ అధికారి ఎన్.వెంకటరమణ, డిఆర్‌డిఎ పీడీ ఎం.సుధారాణి, జిల్లా వ్యవసాయ, ఉద్యానవన, పశు సంవర్థక శాఖాధికారులు కె.రాబర్ట్ పాల్, వై.క్రాంతికుమార్, ఎస్.మన్మథరావు, ఎల్డిఎం ఎన్.విజయ్ స్వరూప్, ఇతర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మార్సిస్ పైనాపిల్ సాగుపై రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పిపి ఈతమనుగూడ పంచాయతీ ఇప్పగూడలో ఐసిఎఆర్ - డిసిఆర్ పుత్తూరు వారి సౌజన్యంతో మారిసష్ పైనాపిల్ రైతులకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా పైనాపిల్స్ ఏ విధంగా పెంచాలి, పంటను ఎలా సంరక్షణ చేయ్యాలి, మూడేళ్లకు నాలుగుసార్లు పంట దిగుబడి పొందాలని తెలిపారు. జీడి పంట యాజమాన్యం కోసం రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాసరాజు రైతులకు అవగాహన కల్పించారు. పెద్దింటి సూర్యనారాయణ పొలంలో డెమో చేసి మొక్కలు ఎంత దూరం నాటినట్లు అయితే రైతుకు ఎంత ఉపయోగమనే విషయంపై రైతులకు వివరించారు. పంట దిగుబడి పొందేందుకు పశువులు ఎరువు, ఘన, ద్రవజీవామృతం, ఇత్రలిన్, కాల్షియం కార్బోనేట్, యూరియాల మిశ్రమాలను ఉపయోగించి పూతను త్వరగా రాబట్టి పంటకు అవసరమయ్యే సీజన్‌లో పొందవచ్చునని తెలిపారు. ఈ శిక్షణకు బిల్లమడ, ఇప్పగూడ, పాత రేగులగూడ గ్రామాల నుంచి 25మంది రైతులు శిక్షణలో పాల్గొన్నారు. వెలుగు అసోసియేషన్ కొత్తూరు నుంచి ఏరియా కోఆర్డినేటర్

పైనాపిల్ పంటను పరిశీలిస్తున్న కెవికె శాస్త్రవేత్త శ్రీనివాసరాజు

పి.నాగేశ్వరరావు, మిన్నారావు, క్లస్టర్ కోఆర్డినేటర్లు ఎస్.పార్వతి, ఆదిలక్ష్మి శిక్షణలో పాల్గొన్నారు.

దర్గాగా ప్రభుత్వ భూమి కబ్జా

జిల్లా కలెక్టర్‌కు సర్పంచ్ ఫిర్యాదు

ప్రజాశక్తి - పార్వతీపురం

కొమరాడ మండలం మాదలింగి గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూమిని అధికారపార్టీకి చెందిన నాయకులు దర్గాగా కబ్జా చేశారని ఆ గ్రామ సర్పంచి టి.కళావతి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 1983లో ఆ స్థలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం కార్యాలయాన్ని నిర్మించారు. 20ఏళ్లగా ఆ భవనంలో పిఎసిఎస్ కార్యకలాపాలు సాగాయి. అయితే ఇటీవల ఆ భవనాన్ని పడగొట్టి స్థలం తమ గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు ఉదయశేఖర పాత్రుడు కన్నేసి ఆక్రమణకు పురమాయించారని తెలిపారు. మరో ఏడుగురు వ్యక్తులతో కలిసి ఆయన ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు స్కెచ్ వేసినట్లు సర్పంచ్ విలేకరులకు చెప్పారు. ఈమేరకు ఆమె బుధవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రీల్స్ తయారీదారులకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు, జలపాతాలు, చారిత్రక ప్రదేశాలపై ఉత్తమ వీడియోలను తీసిన రీల్స్ తయారు చేస్తున్న వారికి రాష్ట్ర మహిళా, శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డితో కలిసి బుధవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బహుమతులను పంపిణీ చేశారు. జిల్లావ్యాప్తంగా 38 మంది రీల్స్ తయారీదారులు 48 వీడియోలను వెబ్ సైట్‌లో అప్ లోడ్ చేయగా, అందులో ఐదింటిని ఉత్తమ రీల్స్ గా ఎంపిక చేశారు. ఇందులో పార్వతీపురానికి చెందిన మర్రి రవికి ప్రథమ బహుమతి కింద రూ.5వేలు నగదు బహుమతి, సర్టిఫికేట్, జ్ఞాపికను మంత్రి అందజేశారు. సాలూరు మండలం గదబ బొడ్డవలస నుంచి కోన మహేష్‌కు ద్వితీయ బహుమతిగా రూ.3 వేలు, సీతంపేటకు చెందిన కె.టెండూల్కర్‌కు రూ.2వేలుతో పాటు సర్టిఫికేట్, జ్ఞాపికలను మంత్రి బహూకరించారు. పార్వతీపురం మండలం నర్సిపురం పంచాయతీ వెంకటరాయుడు పేటకు చెందిన మహతో ఇంద్రాణికి, పార్వతీపురం నుంచి పట్టాభి అనిల్ కుమార్ కు కన్సోలేషన్ బహుమతితో పాటు సర్టిఫికేట్, జ్ఞాపికలను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ప్రత్యేక ఉప కలెక్టర్లు, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కూతురిపై అఘాయిత్యం... తండ్రికి జైలు శిక్ష

కంటోన్మెంట్: బొబ్బిలి పట్టణం ఇందిరమ్మ కాలనీలో కుమార్తెపై అఘాయిత్యానికి యత్నించిన తండ్రికి పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి ఐదేళ్ల జైలు శిక్ష విధించారు. బాధితురాలికి పరిహారంగా రూ.50వేలు మంజూరు చేస్తూ తీర్పు చెప్పారు. బొబ్బిలి పట్టణం ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న కాసా నర్సింగరావు (42) 2024 జూలై 19న ఇంట్లో ఎవరూ లేని సమయంలో నిద్రిస్తున్న తన 11ఏళ్ల కుమార్తెపై లైంగిక దాడికి యత్నించినట్లు బాలిక అమ్మమ్మ బొబ్బిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నేరం రుజువు కావడంతో నర్సింగరావుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాధితురాలికి పరిహారంగా రూ.50 వేలును మంజూరు చేస్తూ తీర్పును వెల్లడించారు.

కంబర, గడగమ్మ స్కూళ్లకు టీచర్లను నియమించండి : యుటిఎఫ్

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని కంబర, గడగమ్మ పాఠశాలలకు ఉపాధ్యాయులను నియమించాలని యుటిఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి మజ్జి పైడిరాజు,అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోనంగి దుర్గాప్రసాద్,కురమాన గోవిందరావు మాట్లాడుతూ ఇటీవల జరిగిన అంతర్ జిల్లా బదిలీల్లో గడగమ్మ, కంబర పాఠశాలల నుంచి సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు విజయనగరం జిల్లాకు బదిలీ అయ్యారన్నారు. అంతర్ జిల్లా బదిలీలు, డీఎస్సీ-2025 నియామకాలలో ఆ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయలేదన్నారు. అలాగే కంబర ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు మృతి చెందడంతో ఆ పాఠశాలలో రెండు ఖాళీలు ఏర్పడ్డాయన్నారు. మోడల్ ప్రైమరీ పాఠశాలలో ఐదు తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులు బోధన, అలాగే గడగమ్మ ప్రాథమికోన్నత పాఠశాలలో 8 తరగతులకు ముగ్గురు ఉపాధ్యాయులు బోధించడం ఇబ్బందికరం ఉందన్నారు. కావున కంబర, గడగమ్మ పాఠశాలలకు క్లస్టర్‌లో ఉన్న ఉపాధ్యాయులను విద్యా సంవత్సరం చివరి వరకు శాశ్వతంగా నియమించాలని ఎంఇఒను వారు కోరారు.

కార్యకర్త కుటుంబానికి వీరేశ్ చంద్ర దేవ్ పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

మండల కేంద్రానికి చెందిన టిడిపి సీనియర్ కార్యకర్త కర్రి శ్రీను తండ్రి సత్యం అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేష్ చంద్రదేవ్ బుధవారం వారి ఇంటికెళ్లి పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు నేరడబిల్లి వంశీ, టిడిపి నాయకులు బలగ రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

సమన్వయంతో పని చేయాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఆరోగ్య కార్యక్రమాలను పక్కగా అమలు చేస్తూ, ప్రజారోగ్యం దృష్ట్యా సమన్వయంతో పని చేయాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు స్పష్టం చేశారు. ఆరోగ్య పర్యవేక్షకులకు స్థానిక ఎన్జీఓ హోంలో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. డిఎంహెచ్ఒ, మరియు ప్రోగ్రాం అధికారులు సమావేశంలో పాల్గొని నిర్దేశిత ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. వసతి గృహాలను ప్రతి రోజూ షెడ్యూల్ ప్రకారం నియమించిన వైద్య సిబ్బంది సందర్శించి విద్యార్థుల ఆరోగ్య సమాచారం తీసుకోవాలని, ఏ చిన్న అనారోగ్య లక్షణం గుర్తించినా అవసరమైన చికిత్స అందించి పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. జ్వర నిర్ధారణ పరీక్షలు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు. అన్ని ఆరోగ్య కేంద్రాల్లో జాతీయ నాణ్యతా ప్రమాణాలు అమలు చేస్తూ రోగులకు సంతృప్తికర వైద్య సేవలందించాలన్నారు. ప్రతి ఆరోగ్య కార్యక్రమానికి చెందిన రికార్డులు, ఆన్లైన్ నివేదికలు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. గ్రామాల్లో ఆరోగ్య సర్వేలు చేపట్టి సకాలంలో జ్వరాలు, వ్యాధులను గుర్తించాలని, శాఖల సమన్వయంతో నివారణ చర్యలు చేపట్టాలన్నారు. మారుమూల గిరిశిఖర గ్రామ గర్భిణీలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకావాలన్నారు. పిల్లలకు టీకాలు సకాలంలో పూర్తి చేయన్నారు. టిబి, లెప్రసీ వ్యాధిగ్రస్తులను పర్యవేక్షించాలన్నారు. సీజనల్ వ్యాధులు, కామెర్లపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన పెంపొందించాలని తెలియజేస్తూ అవసరమైన కర పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డిఐఒ వై.విజయ్ మోహన్,డిప్యూటీ డిఎంహెచ్ఓ కెవిఎస్ పద్మావతి, జిల్లా ప్రోగ్రాం అధికారులు టి.జగన్ మోహనరావు, పిఎల్.రఘుకుమార్, సూర్య కౌశిక్, డిఎంఒ మణి, డిపిఒ లీలారాణి, డిసిఎం విజయలత తదితరులు పాల్గొన్నారు.

27 వరకు టెండర్ గడువు పొడిగింపు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

2025-26 విద్యా సంవత్సరానికి గుమ్మలక్ష్మీపురం, కొటికపెంట, కురుపాం, అనసభద్ర, భామిని ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో వాహన సేవలను అందించడానికి అనుభవజ్ఞులైన, అర్హత కలిగిన సర్వీస్ ప్రొవైడర్ల నుంచి ఆహ్వానించిన సీల్డ్ టెండర్లు స్వీకరణ గడువు ఈనెల 27 సాయంత్రం 5 గంటల వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ వీర్ సింగ్ తెలిపారు. ఈనెల 28 ఉదయం 11 గంటలకు గుమ్మలక్ష్మీపురం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నందు టెండర్లు తెరువబడునని తెలిపారు.

వైద్య కాలేజీల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

మండలంలోని మరికిలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారథ్యంలో వైద్య కాలేజీ ప్రైవేటీకరణను నిరసస్తూ కోటి సంతకాల సేకరణను బుధవారం చేచేపట్టారు. ఈ సందర్భంగా జోగారావు మాట్లాడుతూ వైసిపి హయాంలో ప్రజా ప్రయోజనార్థం తీసుకువచ్చిన 17 మెడికల్ కాలేజీలు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందించాలని ఆశయంతో ప్రారంభించడమే కాకుండా 5 కాలేజీలు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకు వచ్చారని అన్నారు. అయితే కూటమి ప్రభుత్వ పాలనలో మిగతా మెడికల్ కాలేజీలు నిర్మాణం పూర్తి చేయకుండా వాటిని ప్రైవేటీకరణ చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని వైసిపి తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా కోటి సంతకాల ప్రజా ఉద్యమం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. పార్వతీపురంలో సుమారుగా రూ.600 కోట్ల నిధులతో మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టి వైద్య భవనం నిర్మాణం జరుపుకోనగా ఇప్పుడు దాన్ని పీపీపీ విధానంలో ప్రైవేట్ పరం చేయడానికి కూటమి ప్రభుత్వం చంద్రబాబు నాయుడు ప్రయత్నం చేయడం చాలా దుర్మార్గం అని దాన్ని మన ప్రాంత ప్రజలు అందరూ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని, కావున మరిక గ్రామం నుంచి ప్రజలంతా కూటమీ ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా సంతకాలు చేసి మద్దతు తెలపాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మండల వైసిపి అధ్యక్షులు బొమ్మి రమేష్, వైస్ ఎంపీపీలు సిద్దా జగన్నాథం, బి రవికుమార్, ఎంపిపి ప్రతినిధి మజ్జి శేఖర్, సర్పంచ్ గంగమ్మ, మాజీ సర్పంచ్ రాగాల సోమశేఖర్, సీనియర్ నాయకులు పెండ రమణ, త్రినాథ, రమేష్, పకీరు నాయుడు, వివిధ గ్రామాల నాయకులు, స్థానిక పెద్దలు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై వైసిపి నిరసన

సాలూరు : ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం మండలంలోని గంజాయి భద్ర పంచాయతీ పరిధిలో ధూళి భద్రలో వైసిపి జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు

గ్రామస్తుల నుంచి సంతకాలను సేకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే జోగారావు

ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం గిరిజనులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుపరం చేయడం వల్ల గిరిజన, పేద విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారన్నారు. అలాగే పేదలకు ఉచితంగా లభించే వైద్య సేవలు నిలిచిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కళాశాలలు, ఆసుపత్రులు గిరిజన ప్రాంతాలకు చేరువలో ఉండి, వారికి మెరుగైన వైద్య సేవలందించడానికి దోహదపడతాయని తెలిపారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం పేదల ఆరోగ్య హక్కును కాలరాయడమేనన్నారు. గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలు మెరుగుపర్చడానికి వైసిపి ఎంతో కృషి చేసిందన్నారు. ఈ కళాశాలలు పేద విద్యార్థులకు ఆశాకిరణాలని, వాటిని ప్రైవేటుపరం చేస్తే, మన పిల్లలు డాక్టర్లు అయ్యే కలలు కలలుగానే మిగిలిపోతాయని తక్షణమే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గంజాయిభద్ర ఎంపిటిసి అమల, వైసిపి నాయకులు రాంబాబు, మాజీ సర్పంచ్ బీసు, గిరిజనులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని జోగింపేట స్కూల్ ఆఫ్ ఎక్సెన్సీ విద్యార్థులకు రోడ్డు భద్రతపై ఎస్సై ఎం.రాజేష్ బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు 18 ఏళ్ల నిండకుండా మోటార్ వాహనాలను డ్రైవింగ్ చేయరాదన్నారు. అలాగే సైబర్ నేరాలపై అవగాహన కలిగించి వాటిపై జాగ్రత్తలు పాటించాలన్నారు. డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలపై ఎక్కడైనా సమాచారం ఉంటే అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ధర్మరాజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండు బైకులు ఢీకొని జూనియర్ అసిస్టెంట్ మృతి

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలో బుధవారం చుక్కవలస వద్ద రెండు బైకులు ఢీకొని జూనియర్ అసిస్టెంట్ కె.శ్రావణ్ కుమార్(33) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. చుక్కవలస వద్ద ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో నెమలాం జిల్లా పరిషత్తు హై స్కూల్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్రావణ్ కుమార్ మృతి చెందాడు. ఈయన వెనుక ఉన్న అదే స్కూల్లో అటెండర్‌గా పనిచేస్తున్న బి.రమణమ్మకు తలపైన గాయాలయ్యాయి. ఈమెను చికిత్స నిమిత్తం రాజాంలో ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఎదెరుగా ఢీ కొట్టిన బూరిపేటకు చెందిన చింత శివాజీకి కూడా గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని స్థానిక ఎస్ఐ సాగర్‌బాబు పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. శ్రావణ్‌కుమార్ మృతదేహాన్ని బాడంగి సిహెచ్‌సికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు. మృతునికి భార్య నారాయణమ్మ, 8 సంవత్సరాలు కుమారుడు సాయి శ్రావణ్ ఉన్నారు. పెరుమాలి ఆసుపత్రి వద్ద భార్య రోధన చూపరులను కంటతడి పెట్టించింది. ఆస్పత్రి వద్ద ఎంఇఒ జె.త్రినాథరావు, నెమలాం జిల్లా పరిషత్తు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు డి.సంగమేశ్వరరావు, ఉపాధ్యాయులు, యుటిఎఫ్ మండల పార్టీ అధ్యక్షులు జి.మునిస్వామి, బూరిపేట సర్పంచ్ బూరి మధుసూదన్ రావు సహాయక చర్యలు చేపట్టారు.

గర్భిణుల వసతిగృహాల సిబ్బందిని కొనసాగించాలి

మంత్రి సంధ్యారాణికి వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజన గర్భిణుల వసతిగృహాల్లో పని చేస్తున్న తమను కొనసాగించాలని కోరుతూ బుధవారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణినిసిబ్బంది కలిసి వినతిపత్రం అందజేశారు. గిరిజన సంఘం నాయకులు దుక్క సీతారాం, ఆరిక చంద్రశేఖర్ ఆధ్వర్యాన సిబ్బంది జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంత్రి సంధ్యారాణిని కలిశారు. అనేక ఏళ్లుగా పనిచేస్తున్న సిబ్బందిని ఆపేసి ఏరియా ఆసుపత్రికి చెందిన సిబ్బందిని గర్భిణుల వసతి గృహంలో నియమిస్తామని ఐటిడిఎ పిఒ యశ్వంత్ కుమార్ రెడ్డి చెప్పారని తెలిపారు. దీంతో అక్కడ ఉన్న సిబ్బంది ఆందోళన చెందుతున్నారని చెప్పారు. బడ్జెట్ వచ్చిన తర్వాత జీతాలు ఇచ్చే వరకు కొనసాగించాలని కోరారు. దీనికి మంత్రి సంధ్యారాణి హామీ ఇచ్చారు.

కుక్కలు బాబోయ్ కుక్కలు ...

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పలు గ్రామాల్లో కుక్కల సంఖ్య రోజురోజుకు పెరిగిపోవడంతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. గ్రామాల్లో ఆవు దూడలు, పసిపిల్లలు, గొర్రెలు, కోళ్లపై దాడులు చేస్తున్నాయి. వీటితో ఆగకుండా వాహనదారులపై కూడా దాడికి పాల్పడుతున్నాయి. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వీటిపై అధికారులు నియంత్రణా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అంటిపేటకు చెందిన సిహెచ్.కృష్ణను ఈనెల 17న మోటార్ వాహనం ఢీకొనడంతో చికిత్స పొందుతూ మరణించినట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు ఆయన భార్య రాము పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన వివరాలిలా ఉన్నాయి. ఈనెల 17న తమ గ్రామంలో మెయిన్ రోడ్డు పై నడిచి వెళ్తుండగా సీతానగరం నుంచి బొబ్బిలి వైపు వెళ్తున్న మోటార్ సైకిల్ వెనుక నుంచి ఢీకొట్టడంతో కృష్ణ రోడ్డుపై పడ్డంతో అతనికి బలమైన గాయం తగిలింది. దీంతో విజయనగరం చికిత్స నిమిత్తం తరలించగా మెరుగైన వైద్యం కోసం కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతుండగా మరణించినట్లు రాము పేర్కొన్నారు. ఎస్సై ఎం.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాణసంచా పేలుడు ఘటనలో నలుగురికి రిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఈ నెల 19న స్థానిక ఆర్టీసీ కార్గో సర్వీస్ కొరియర్ సెంటర్ వద్ద బాణాసంచా పేలిన ఘటనపై జిల్లా ఎస్పీ ఎస్ వి మాధవరెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేపట్టారు. ఈ పేలుడుతో సంబంధం కలిగిన నలుగురు నిందితులైన గోడ బాంబులను తయారు చేసిన మెంటాడ మండలం ఇద్దనవలస చెందిన దాసరి పెంటయ్యను, అతని నుండి కొనుగోలు చేసిన విజయనగరం మండలం కొండకరకంకు చెందిన ముప్పిడి కాశి రాజును, విజయనగరం నుండి ఆర్టీసీ కార్గో సర్వీస్‌లో బుక్ చేసి పంపిన విజయనగరానికి చెందిన అల్లాడ రవీంద్రను, గోడ బాంబులను కార్గో సర్వీస్ ద్వారా బస్సులో తెప్పించుకున్న కొమరాడ మండలం నిమ్మలపాడుకు చెందిన కొత్తకోట కిషోర్‌ను పక్కా ఆధారాలతో విచారించి, అరెస్ట్ చేసి బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సిఐ జి. మురళీధర్, పట్టణ ఎస్సై గోవిందరావు తెలిపారు.